సాక్షి
తిరుపతి

బుధవారం, 29, నవంబర్, 2023



వేగవంతంగా భూసంస్కరణలు

సీఎం జగనన్న ప్రభుత్వంలో భూసంస్కరణలు వేగవంతమయ్యాయని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. - 8లో



సురక్ష..శ్రీరామరక్ష

జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలపాలిట వరంగా మారింది. ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం లభిస్తోంది. - 8లో



శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని మంగళవారం సినీ నటుడు సాయిధరమ్‌తేజ్‌తోపాటు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 58,176 మంది స్వామివారిని దర్శించుకోగా 20,157 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.22 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆగమోక్తంగా ఆకాశ దీపం



కార్తీక దీపాన్ని ఎగురవేస్తున్న చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం ఆకాదీపాన్ని ఆగమోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతిరోజూ ఆకాశ దీపాన్ని వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయంలోని ఊంజల్‌సేవా మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఈనెల 29, 30 తేదీల్లో శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు మండల స్థాయిలో, సబ్జెక్టు ఉపాధ్యాయులకు మూడు మండలాలకు చొప్పున ఒక్కో సబ్జెక్టును ఒక్కో మండలంలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలలకు 50శాతం మంది ఉపాధ్యాయుల చొప్పున రెండు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఈ విషయాన్ని గుర్తించి శిక్షణకు హాజరు కావాలని ఆయన కోరారు.

3న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్: జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) 2023–24కు సంబంధించి డిసెంబర్ 3వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టికెట్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయ వెబ్‌సైట్ అయిన డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా స్కూల్ లాగిన్‌తో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు పాఠశాల యూడైస్ కోడ్ ద్వారా లాగిన్ అయ్యి వారి పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసి అందించాలని డీఈఓ సూచించారు.

15 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'



ఆడుదాం ఆంధ్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ డీకే బాలాజీ

తిరుపతి అర్బన్: జిల్లాలో డిసెంబర్ 15 నుంచి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కలెక్టరేట్ వద్ద క్రీడలకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 51 రోజుల పాటు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ మేరకు పోటీల నిర్వహణకు కావలసిన మైదానాలు, స్టేడియాలు సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. క్రీడల్లో పాల్గొనదలచిన వారు 1902 నంబర్‌కు కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.

డిసెంబర్‌లో విశేష ఉత్సవాలు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్‌లో జరగనున్న విశేష ఉత్సవాల వివరాలను టీటీడీ ప్రజా సంబంధాల విభాగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. డిసెంబర్ 3న పార్వేట మండపంలో కార్తీక వన భోజన ఉత్సవం, 8న సర్వ ఏకాదశి, 12న అధ్యయనోత్సవాలు ప్రారంభం, 17న ధనుర్మాసం ప్రారంభం, 22న తిరుమల శ్రీవారి సన్నిధిలో చిన్న శాత్తుమొర, 23న వైకుంఠ ఏకాదశి, శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభం, స్వర్ణరథోత్సవం, 24న వైకుంఠ ద్వాదశి నాడు శ్రీవారి చక్రస్నానం, శ్రీస్వామి పుష్కరిణీతీర్థ ముక్కోటి, 28న శ్రీవారి ఆలయంలో ప్రణయకలహ మహోత్సవం జరగనున్నట్లు తెలిపింది.

సభకు హాజరైన విద్యార్థులు



విద్యార్థినులతో సెల్ఫీ తీసుకుంటున్న మంత్రి రోజా

"ప్రతి విద్యార్థినీ జీవితంలో ఎదిగేందుకు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. అధిగమించేందుకు కఠోరంగా శ్రమించాలి. ఎంచుకున్న మార్గంలో విమర్శలు.. అంటకాలు.. అవమానాలు ఎదురైనా ధైర్యంగా తిప్పికొట్టాలి. ప్రతి క్షణం తల్లిదండ్రులు మన కోసం పడిన కష్టాలను గుర్తుచేసుకుంటూ.. వారి ఆశలు.. ఆకాంక్షలను నెరవేర్చే దిశగా దూసుకుపోవాలి." అని మంత్రి ఆర్‌కే రోజా పిలుపునిచ్చారు. సోమవారం తిరుపతి శ్రీపద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో ఆమె ఉద్వేగభరితంగా ప్రసంగించారు.

విజయమే నీ లక్ష్యం!

- విద్య, క్రమశిక్షణకు నిలయం ఎస్పీడబ్ల్యూ కళాశాల
- ఆడపిల్లలను అన్నిరంగాల్లో ప్రోత్సహించింది సీఎం జగనన్నే
- నా జీవితాన్ని మలుపు తిప్పింది పద్మావతి కళాశాల
- పూర్వ విద్యార్థుల సభలో మంత్రి రోజా భావోద్వేగం

తిరుపతి సిటీ: విజయమే లక్ష్యంగా విద్యార్థినులు కష్టపడి చదవాలని రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మేళనానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కళాశాలకు రావాలని ఎదురుచూశానని, నేడు మంత్రి హోదాలో కల సాకారమైందన్నారు. ఎన్నో కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యానని, కానీ ఈ కార్యక్రమానికి హాజరు కావడం జీవితంలో మరిచిపోలేనని చెప్పారు. పద్మావతీ డిగ్రీ కళాశాల విద్యతో పాటు క్రమశిక్షణకు నిలయమని కొనియాడారు. ప్రతి విద్యార్థినీ ఉన్నత లక్ష్యాన్ని ఎంపిక చేసుకుని అందుకోసం కష్టపడాలన్నారు. ఇందుకు ప్రధాన సాక్షి తన జీవితమేనన్నారు. కళాశాల, తల్లిదండ్రులు గర్వించేలా మన ప్రవర్తన ఉండాలన్నారు. సీఎం జగనన్న ఆడపిల్లలను అన్ని రంగాల్లోనూ రాణించేలా తీర్చిదిద్దారని, అండగా నిలబడి మహిళా పక్షపాతిగా నిలిచారని కొనియాడారు. కళాశాల మనకు విద్యతోపాటు, జీవిత పాఠాలు నేర్పుతుందన్నారు. ఈ కళాశాలలో చదువుతోంది ఆడపిల్లలు కాదు ఆడ పులులని నిరూపించాలన్నారు. మీరు వేసే ప్రతి అడుగూ పది మందికి ఆదర్శం కావాలని విద్యార్థినులకు సూచించారు. 70 ఏళ్లుగా నడుస్తున్న అతి పురాతన కళాశాలను గర్వించదగ్గ రీతిలో తీర్చిదిద్దుతున్న టీటీడీ, అధ్యాపకులు, సిబ్బందికి ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డీఈఓ ఎం భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ మహాదేవమ్మ, ప్రేమావతి, డాక్టర్ కృష్ణప్రశాంతి, అధ్యాపకులు విద్యాలత, వసుధ తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీల జోరు

మంత్రి రోజా ఎస్పీడబ్ల్యూ కళాశాల ఆవరణలోకి చేరుకోగానే విద్యార్థులు ఉప్పొంగిన అభిమానంతో ఘన స్వాగతం పలికారు. కేరింతలు కొడుతూ, సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. వారి అభిమానానికి మంత్రముగ్ధురాలైన మంత్రి రోజా దబిడి దిబిడే, తగ్గేదేలే అనే సినీ డైలాగులతో యువతను ఉర్రూతలూగించారు. అనంతరం ఆమె విద్యార్థినులతో సెల్ఫీలు దిగి ఉత్సాహపరిచారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్

రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా మహిళల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మంత్రి రోజా కొనియాడారు. మంగళవారం పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జరిగిన అల్యూమిన్నీ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఆడపిల్లల చదువుకోసం జగనన్న చేస్తున్న కృషిని మహిళలు మరిచిపోరన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు మహిళలు అండగా నిలిచి మళ్లీ సీఎంగా చేసుకుంటామని సంతోషంగా చెబుతున్నారని వెల్లడించారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్షాలకు దబిడి దిబిడే అని స్పష్టం చేశారు.

భావోద్వేగం..మంత్రి ప్రసంగం

ఎస్పీడబ్ల్యూ కళాశాలలో తాను చేసిన చిలిపి చేష్టలు, అల్లరిని గుర్తుచేసుకుంటూ చెమర్చిన కళ్లతో మంత్రి భావోద్వేగానికి గురయ్యారు. 33 ఏళ్లకు ముందు ఇక్కడ విద్యార్థినిగా ఉన్నానని, మళ్లీ విద్యార్థులతో కలిసి ఇక్కడ చదవాలని ఆశగా ఉందన్నారు. తాను సైన్స్ విద్యార్థినని, ఫిజిక్స్ అంటే తనకు భయంగా ఉండేదన్నారు. విద్యార్థులు ఆమెకు రోజా పూలు చూపిస్తూ ఘన స్వాగతం పలకారు. మంత్రిని ఈ సందర్భంగా కళాశాల అధికారులు, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.



మంత్రి రోజానుు సన్మానిస్తున్న కళాశాల అధికారులు, అధ్యాపకులు

సమసమాజ స్థాపకుడు పూలే



పూలేకు నివాళి అర్పిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, బీసీ నేతలు

తిరుపతి కల్చరల్: భారతీయ సమసమాజం కోసం కృషి చేసిన మహాత్ముడు జ్యోతిరావ్‌పూలే అని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. జ్యోతిరావ్ పూలే 133వ వర్ధంతిని పురస్కరించుకొని బాలాజీ కాలనీలోని పూలే విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు జనావళి అభ్యున్నతే ధ్యేయంగా పూలే కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, మునిరామిరెడ్డి, వరికుంట నారాయణ, కట్టా గోపీయాదవ్, సాకం ప్రభాకర్, దేవదానం, గీత యాదవ్, సునీల్ యాదవ్, మదుసూధన్ నాయుడు, తాళ్లూరి ప్రసాద్, నాదముని పాల్గొన్నారు. ఇదిలావుండగా మరో వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పాల్గొని పూలకు నివాళి అర్పించారు. అలాగే మేయర్ డాక్టర్ శిరీష పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

తిరుపతి అర్బన్: అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావుపూలే అని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి కొనియాడారు. మంగళవారం కలెక్టరేట్‌లో మహాత్మాజ్యోతిరావు పూలే 133వ వర్ధంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారశాఖ వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు, డీఆర్ఓ పెంచల కిషోర్, జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ, సాధికార అధికారి భాస్కర్‌రెడ్డి పూలే చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యమకర్త, సంఘ సేవకుడు, సామాజిక తత్వవేత్త, మహిళా అభ్యుదయ వాది పూలే అన్నారు. జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖ అధికారి బాలకొండయ్య, గిరిజన సంక్షేమశాఖ అధికారి సూర్యనారాయణ, ఏబీసీడబ్ల్యూఓ కృష్ణయ్య, వెంకటేష్, జ్యోత్స్న పాల్గొన్నారు.

రాద్ధాంతం వద్దు..అభివృద్ధే ముద్దు

- తిరుపతి అభివృద్ధికి టీటీడీ ఎంత ఖర్చుచేసినా తప్పు లేదు
- టీటీడీ ఆస్తులకు పన్నులు వసూలు చేయడం లేదు
- అఖిలపక్ష సమావేశంలో మేధావుల ఏకాభిప్రాయం

తిరుపతి మంగళం: 'బీజేపీ వితండ వాదం చేస్తోంది. ఆ పార్టీ చేస్తున్న అభ్యంతరాలను లెక్కపెట్టాల్సిన పనిలేదు. తిరుపతి నగరాభివృద్ధికి టీటీడీ నిధులు ఖర్చు చేయడం ఎంతమాత్రం తప్పుకాదు' అని అఖిల పక్షసమావేశం అభిప్రాయపడింది. 'టీటీడీ నిధులతో తిరుపతి అభివృద్ధి' అనే అంశంపై తిరుపతి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. తిరుపతి అభివృద్ధికి టీటీడీ ఎన్ని కోట్లు ఖర్చు పెట్టినా తప్పే లేదని సభ్యులు ముక్తకంఠంతో చెప్పారు. ఈ విషయంలో బీజేపీ రాజకీయ రాద్ధాంతం చేస్తోందని ధ్వజమెత్తారు. తిరుపతిలో 42 శాతం టీటీడీ ఆస్తులు ఉన్నా మున్సిపల్ కార్పొరేషన్ ఒక్క రూపాయి పన్ను కూడా వసూలు చేయడం లేదన్న విషయాన్ని ఆ పార్టీ గుర్తించాలన్నారు. బీజేపీ విధానం ప్రమాదకరమన్నారు. 28–5–1987న ప్రభుత్వం ఆమోదించిన టీటీడీ చట్టంలోని 146వ పేజీ 111 పాయింట్‌లో తిరుపతి నగరంలో భక్తులు, యాత్రికుల కోసం తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం కోసం టీటీడీ నిధులు ఖర్చు చేయవచ్చని స్పష్టంగా ఉందనే విషయాన్ని సీపీఎం నాయకుడు కందారపు మురళి సమావేశం దృష్టికి తెచ్చారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చినబాబు మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు ఖర్చు చేయవచ్చని చెప్పారు. తమ పార్టీ విధానం కూడా అదేనని వెల్లడించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేష్, అజయ్, వాసు యాదవ్, ఆర్పీఐ పార్టీ నాయకుడు అంజయ్య, సీపీఐ నాయకుడు మురళి, రాయలసీమ మేధావుల ఫోరం అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కృష్ణప్రసాద్‌తో పాటు పలువురు జర్నలిస్టులు టీటీడీ పాలకమండలి తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు.

ఒంటరిగా బీజేపీ

తిరుపతి నగర అభివృద్ధికి టీటీడీ వార్షిక బడ్జెట్ నుంచి 1 శాతం నిధులు రాకుండా అడ్డుపడిన బీజేపీ ఒంటరిగా మిగిలింది. ఇప్పుడు తిరుపతి నగర పారిశుద్ధ్య నిర్వహణకు కూడా టీటీడీ నిధులు ఇవ్వరాదని వితండ వాదానికి దిగి పరువు పోగొట్టుకుంది. బీజేపీ మిత్రపక్షం జనసేన కూడా టీటీడీ ధర్మకర్తల మండలి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీ, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, బీఆర్ఎస్, ఇతర రాజకీయ పక్షాలు, స్థానిక జర్నలిస్టులు కూడా తిరుపతికి టీటీడీ నిధులు ఇవ్వాల్సిందేనని ఏకగ్రీవంగా తీర్మానం చేయడం బీజేపీకి నోట్లో వెలక్కాయ పడినట్టయ్యింది.

ఆ పత్రికలపై ఆగ్రహం

తిరుపతి నగర అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణకు టీటీడీ నిధులు కేటాయించడాన్ని తప్పు పడుతూ రెండు పత్రికలు వండి వార్చుతున్న కథనాలను సమావేశం తీవ్రంగా ఖండించింది. నిధుల విడుదలలో అవినీతి జరిగిందనే తప్పుడు కథనాలను రాయడంపై అఖిలపక్ష సమావేశం తీవ్ర అభ్యంతరం తెలిపింది.



అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న మేధావులు, రాజకీయ పార్టీల నేతలు, పాత్రికేయులు

పారదర్శకంగా కులగణన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి



ఐదు జిల్లాల నుంచి విచ్చేసిన కులసంఘం నేతలు

- తొమ్మిది దశాబ్దాల తర్వాత నిర్వహణ
- ఐదు జిల్లాల కుల సంఘం నేతలు హాజరు
- శ్రీపద్మావతి యూనివర్సిటీలో ప్రాంతీయ సదస్సు

తిరుపతి అర్బన్: పారదర్శకంగా శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేపడుతామని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. తిరుపతి శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ పరిధిలోని ప్రియదర్శిని ఆడిటోరియంలో మంగళవారం కులగణన ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు తిరుపతి, చిత్తూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలకు చెందిన కులసంఘం నేతలు హాజరయ్యారు. ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాట్లు చేపట్టారు. ఈ సదస్సు సభాధ్యక్షులుగా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగితోపాటు వలంటీర్ కులగణనలో పాల్గొంటారని వెల్లడించారు. ఇంటి సభ్యుల బయోమెట్రిక్‌తోపాటు, సచివాలయ బయో మెట్రిక్ ఉంటేనే యాప్ తీసుకుంటుందని స్పష్టం చేశారు. వంద శాతం పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. తొమ్మిది దశాబ్దాల తర్వాత కుల గణన చేపడుతున్నట్టు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ కులాలు మినహా మిగిలిన వారిని జనరల్ కేటగిరీ కింద లెక్కిస్తూ వస్తున్నారని వివరించారు. కులాల వారీగా జనాభా లెక్కించడం వల్ల ప్రభుత్వ పథకాల రూపకల్పనకు ఉపయోగపడతుందని వివరించారు. కుల సంఘాలతోపాటు రాజకీయపార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంఘాల నేతలు సంపూర్ణంగా సహకరించాలని ఆయన కోరారు.

కులగణన చారిత్రాత్మకం

చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ తొమ్మిది దశాబ్దాల తర్వాత కులగణన చేపట్టడం చారిత్రాత్మకమైన అంశమన్నారు. బడుగు, బలహీన వర్గాల వారికి సరైన న్యాయం చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులగణన నిర్ణయాన్ని తీసుకున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టని విధంగా రాష్ట్రంలో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, రాజకీయ ఆర్థిక సమానత్వం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ సమాజంలో అంతరాలు తొలగాలంటే తప్పనిసరిగా కులగణన అవసరమన్నారు. చిత్తూరు మేయర్ అముద మాట్లాడుతూ బడుగుల ఆశాజ్యోతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సదస్సులో తిరుపతి డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, వివిధ జిల్లాల కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు లక్ష్మయ్య, పుల్లయ్య, సురేంద్రనాథ్, కుమార్‌రాజా, శాంతి, బాబు, షేక్ సిరాజ్‌బాషా, శ్రీరాములు, వేమ నారాయణ, అక్కులప్పనాయక్ తదితరులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. మరికొందరు తమ అభిప్రాయాలను వినతిపత్రం రూపంలో కలెక్టర్‌కు అందించారు. ఈ సదస్సులో తిరుపతి కుల గణన అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ డీకే. బాలాజీ, శ్రీపద్మావతి యూనివర్సిటీ వీసీ డీ. భారతి, కాపు కార్పొరేషన్ చైర్మన్ శేషగిరి, ఎండీ కృష్ణమూర్తి, చిత్తూరు డీఆర్వో రాజశేఖర్, చిత్తూరు జిల్లా కుల గణన అధికారి జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు శాంతి, వనిత, వరలక్ష్మి, సుమతి, తిలక్ బాబు, వెంకటనారాయణ, భూపేష్ గోపీనాథ్, పురుషోత్తం, ఎల్లప్ప, రమణ, ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, డీఎల్‌డీఓ ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

ఆ భూములకు రిజిస్ట్రేషన్లు

తిరుపతి అర్బన్: నిషేధిత భూముల(22ఏ)జాబితా నుంచి తొలగించిన వాటికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేయనున్నట్టు జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అక్కారంపల్లి గ్రామంతోపాటు తిరుపతి నగరంలో పలు ప్రాంతాలను గతంలో 22ఏ కింద ఉంచారని, నాలుగు దశాబ్దాల తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వాస్తవ పరిస్థితులను గుర్తించి వారికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో 22ఏ కింద ఉన్న భూములను పరిశీలించి నిషేధిత జాబితా నుంచి తొలగించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చారని గుర్తుచేశారు. పరిశీలించిన అనంతరం ఒక్కొక్కటిగా నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నారని పేర్కొన్నారు. తొలగించిన వాటికి మాత్రమే తాము రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. 22ఏ కింద 25 ప్రాంతాలున్నాయని వెల్లడించారు. ప్రధానంగా అక్కారంపల్లి గ్రామంతోపాటు తిరుపతి అర్బన్ పరిధిలో సప్తగిరి నగర్, మధురానగర్, కొర్లగుంట, మారుతీనగర్, సంజయ్‌గాంధీ కాలనీ, సుభాష్‌నగర్, సుబ్బారెడ్డి నగర్, గోవిందనగర్, లక్ష్మీపురం, కేశవనాయనిగుంట, శాంతినగర్, ద్వారకానగర్, శివజ్యోతి నగర్, శింగాలగుంట, ఆర్ఎస్ గార్డెన్స్, కేబీ లేఅవుట్, శింగాలగుంట, నెహ్రూనగర్, బొమ్మగుంట, ఎల్‌కే రోడ్డు, ఎన్‌సీబీ కాలనీ, తాతయ్యగుంట ప్రాంతాల్లో 22ఏ భూములు ఉన్నాయని వివరించారు. అయితే వాటిలో నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములను రిజిస్ట్రేషన్ చేయడానికి తామకు ఎటువంటి అభ్యంతరాలు లేవని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశాన్ని పట్టాలు, ఇండ్లు ఉన్న వారు గుర్తుంచాలని సూచించారు.



జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామకుమార్

ఆగని ఏనుగుల దాడులు

పాకాల: మండలంలో పలు గ్రామాల్లో ఏనుగులు వరుస దాడులకు పాల్పడుతున్నాయి. తాజాగా సోమవారం రాత్రి ఈ–పాలగుట్టపల్లి, వరదప్పనాయుడుపేట, చంద్రగిరివారిపల్లి గ్రామాల్లో సోమవారం రాత్రి ఏనుగులు పంట పొలాలపై దాడికి తెగబడ్డాయి. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక రైతులు మాట్లాడుతూ ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి చేసి కొబ్బరిచెట్లు, మామిడి తోటలను ధ్వంసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కూలీల కుటుంబాల్లో కల్లోలం

- నాట్లు వేసి ఆటోలో ఇళ్లకు ప్రయాణం
- గ్రామానికి కూతవేటు దూరంలో ఆటోను ఢీకొట్టిన టాటాఏస్ వాహనం
- ఇద్దరు కూలీలు మృతి
- 12 మందికి గాయాలు
- తల్లడిల్లుతున్న పేద కుటుంబాలు



రాపూరులో ఐజాక్ ఇంటివద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

డక్కిలి/రాపూరు: కూలీల కుటుంబాల్లో పెను విషాదం నెలకొంది. పొట్టచేత బట్టుకుని కూలిపనులకెళ్లిన ఆ కుటుంబాలను మృత్యువు వెంటాడింది. గ్రామానికి సమీపంలో సోమవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా.. 12 మంది కూలీలకు తీవ్ర గాయాలైన ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వివరాలు.. డక్కిలి మండలం, వెలికల్లు దళితవాడకు చెందిన తొమ్మిది మంది కూలీలు, రాపూరు మండలానికి చెందిన మరో ఏడుగురు కూలీలు రోజూలాగే అందరూ కలిసికట్టుగా వరినాట్లు వేసేందుకు సోమవారం డక్కిలి మండలం, చెన్నసముద్రం (తురకపల్లి)కి వెళ్లారు. అక్కడ నాట్లు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు వెలికల్లుకు చెందిన మచ్చల గోపీ ఆటోను బాడుగకు మాట్లాడుకున్నారు. ఈ క్రమంలో ఆటలో వెలికల్లు దళితవాడకు చెందిన మచ్చల రత్నమ్మ, మచ్చల పద్మమ్మ, నావూరు ఆదిలక్ష్మమ్మ, గాడి పెంచలమ్మ, పాముల పోలమ్మ, మారాసి సుమతి, మచ్చల పెద్ద రమణమ్మ, మౌనికతో పాటు రాపూరు మండలం, ఏపూరు గ్రామానికి చెందిన విశాక్‌తోపాటు రాపూరుకి చెందిన పిట్టా రమణమ్మ, రేవూరు శ్రావణి, డమ్మాయి రత్నం, మేరిగ గురవమ్మ, రేవూరు వెంకటరమణయ్య ఎక్కి ఇళ్లకు బయలుదేరారు. వెంకటగిరి–రాపూరు జాతీయ రహదారి వెలికల్లు దళితవాడకు కూత వేటు దూరంలో రాపూరు నుంచి డక్కిలికి వస్తున్న టాటా ఏస్ వాహనం వేగంగా వచ్చి కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాపూరు మండలం, జోరేపల్లికి చెందిన టాటాఏస్ డ్రైవరు గుండాల వెంకటరమణయ్య(25), ఏపూరు గ్రామానికి చెందిన ఐజాక్(44) మృతిచెందగా.. మిగిలిన కూలీలు తీవ్ర గాయాలతో చెల్లాచెదురుగా పడిపోయారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నాగరాజు తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రలను 108లో రాపూరు ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వారు ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు. వెంకటగిరి సీఐ సంఘమేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





మృతి చెందిన పోతుల ఐజాక్ (ఫైల్) , గుండాల వెంకటేశ్వర్లు (ఫైల్)





నెల్లూరులోని ఓ ఆస్పత్రిలోచికిత్స పొందుతున్న మచ్చల రత్నమ్మ, మచ్చల పద్మమ్మ

హాహాకారాలు

మృతదేహాలకు రాపూరు ప్రభుత్వాస్పత్రిలో శవ పంచనామా నిర్వహించి మంగళవారం బంధువుల కు అప్పగించారు. ఈ సందర్భంగా జోరేపల్లె, ఏపూరికి చెందిన పలువు ఆస్పత్రి వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతడు ఐజాక్‌కు భార్య లక్ష్మమ్మ, కుమారులు నందకుమార్, కార్తీక్ ఉన్నారు. కుటుంబ పెద్దదిక్కును కోల్పోవడంతో తాము వీధిన పడ్డామని బోరున విలపించారు.

పెళ్లైన తొమ్మిది నెలలకే

రాపూరు మండలం, జోరేపల్లికి చెందిన గుండాల వెంకటరమణయ్యకు గత ఫిబ్రవరి 25వ తేదీన రాపూరుకు చెందిన రాధతో వివాహమైంది. ఇతను డక్కిలిలో ఓ ఎలక్ట్రీషియన్ వద్ద పనిచేస్తున్నాడు. రోజూలాగే డక్కిలిలో పనిముగించుకుని కూలీల ఆటోలో జోరేపల్లెకి బయలుదేరి మృత్యువాత పడ్డాడు. ముగ్గురు ఆడబిడ్డల తర్వాత ఒక్కగానొక్క కొడుకు జన్మించాడని తల్లిదండ్రులు వెంకటయ్య, రమణమ్మ చెప్పుకుంటూ బోరున విలపించడం గుండెల్ని పిండేసింది. పెళ్లైన తొమ్మిది నెలలకే ఆ దేవుడు తమ బిడ్డను తీసుకెళ్లాడంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు.



చికిత్స పొందుతున్న నావూరు ఆదిలక్ష్మమ్మ



గాయపడ్డ మచ్చల రమణమ్మతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగరాజు

పంచాయతీ కార్యదర్శిపై జెడ్పీ సీఈఓ ఆగ్రహం



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

తిరుపతి రూరల్: విధి నిర్వాహణలో నిర్లక్ష్యంగా ఉండడమే కాకుండా, పంచాయతీలో రికార్డులను సక్రమంగా నిర్వహించని చెర్లోపల్లి పంచాయతీ కార్యదర్శి బాబునాయుడుపై జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లిలోని పంచాయతీ సచివాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ పరిధిలో అధికారికంగా ప్రతి రోజూ నిర్వహించాల్సిన రికార్డులు సక్రమంగా లేకపోవడంపై మండిపడ్డారు. జెడ్పీ సీఈఓ ఆకస్మిక తనిఖీ సమయంలో పంచాయతీ కార్యదర్శి బాబునాయుడు సచివాలయంలో లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. నెలల తరబడి వలంటీర్ల సంతకాలు రికార్డుల్లో లేకపోవడంపై ఆశ్చర్యం వెలిబుచ్చారు. సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని మండిపడ్డారు. వారిపై చర్యలు చేపట్టాలని తిరుపతి రూరల్ ఎంపీడీఓ, తిరుపతి జిల్లా డీఎల్‌డీఓకు సిఫారసు చేశారు.

బంగారు గొలుసు అప్పగింత

తిరుమల : ఎస్‌ఎంసీ ఏరియాలోని భక్తురాలు మరిచిపోయి వెళ్లిన బంగారు గొలుసును పారిశుద్ధ్య సిబ్బంది తిరిగి అప్పగించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. మహారాష్ట్ర కొల్హాపూర్‌కు చెందిన మాధురి కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు చేరుకున్నారు. ఎస్‌ఎంసీ ఏరియాలో 211 సీ గదిని అద్దెకు తీసుకున్నారు. మంగళవారం గదిని ఖాళీచేసి వెళ్లిపోయారు. గదిని శుభ్రం చేసేందుకు వెళ్లిన పారిశుద్ధ్య సిబ్బంది బంగారు నల్లపూసల దండను గుర్తించి, ఎస్‌ఎంసీ ఎంక్వైరీ కార్యాలయ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఆభరణాన్ని భక్తురాలికి అందజేశారు.

ముక్కంటి ఆలయానికి వెండి కడ్డీల వితరణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి యూఎస్‌ఏకి చెందిన ప్రేమ్‌నాథ్ కుటుంబ సభ్యులు రూ.35,01,000 విలువ చేసే 5 వెండి కడ్డీలను వితరణగా అందజేశారు. వీటిని పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో ఆలయ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు బుల్లెట్ జయశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి వెండికడ్డీలను అందజేస్తున్న దాతలు

వేగవంతంగా భూ సంస్కరణలు



పిచ్చాటూరులో పేదలకు భూ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: సీఎం జగనన్న పాలనలో భూ సంస్కరణలు వేగం పుంజుకున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన పేదలకు భూ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండలంలో డీకేటీ పట్టాలు కలిగి ఉన్న 410 మందికి 384.74 ఎకరాల భూమికి రిజిస్టర్డ్ సెటిల్మెంట్ పట్టాలను పంపిణీ చేశారు. భూమిలేని 11 మంది పేదలకు 4.17 ఎకరాల అసైన్మెంట్ భూములను అందించారు. 17 మంది ఎస్సీ మార్టిగేజ్ డీడ్ కలిగిన రైతులకు 8.15 ఎకరాల భూమిని పంపిణీ చేశారు. అలాగే మండలంలోని పులికుంద్రం, బంగాళ పంచాయతీల్లోని నాలుగు గ్రామాల శ్మశాన వాటికలకు 1.5 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని తహసీల్దారులు యుద్ధప్రాతిపదికన భూ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు.

కల్యాణమస్తు పంపిణీ

మండలంలో పెళ్లైన 30 కొత్త జంటలకు రూ.27 లక్షల మెగా చెక్కును ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పంపిణీ చేశారు. మండల పార్టీ ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి, తహసీల్దారు మధుసూదన్‌రావు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఎం వనిత, వైఎస్‌ఆర్‌సీపీ మండల అధ్యక్షులు కేవీ చలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్‌నాయుడు, సర్పంచ్‌లు అన్నాదురై, ఎంపీటీసీ సభ్యులు రమేష్‌రాజు, శోభన్ బాబు, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య, మాజీ వైస్ ఎంపీపీ పాలపద్మనాభం, నాయకులు మోహన్‌రెడ్డి, శేఖర్, గజేంద్ర, వెంకటేశులు, త్యాగరాజు, ఏసు, వాసురెడ్డి, చెంగల్రాయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





లెజిస్లేచర్ సెక్రటేరియట్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం లెజిస్లేచర్ సెక్రటేరియట్ చైర్మన్, కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, సినీనటి దివ్య బాలకృష్ణ, సినీ నటుడు సాయిధర్మతేజ, సింగర్ విజయ్‌ప్రకాష్, అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి, మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

10 కేజీల గంజాయి స్వాధీనం

సూళ్లూరుపేట: విశాఖపట్నం నుంచి చెన్నైకి తరలించే క్రమంలో సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం సుమారు రెండు లక్షల విలువచేసే 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు తెలిపారు. సెబ్ అధికారుల కథనం.. కర్ణాటకు రాష్ట్రానికి చెందిన శ్రీనాథ్‌రెడ్డి, విశాఖపట్నానికి చెందిన అనిల్ ఇద్దరూ స్నేహితులు. విశాఖపట్నంలో అనిల్ అనే వ్యక్తి నుంచి బెంగళూరులోని మంజునాథ అనే అతనికి అందించేందుకు నిందితుడు శ్రీనాథ్‌రెడ్డి రూ.10 వేల కిరాయికి మాట్లాడుకుని గంజాయిని చెన్నైకి తీసుకెళ్తున్నాడు. సెబ్ అధికారులు అప్రమత్తమై అతన్ని వెంబడిస్తూ రైల్వేస్టేషన్ వద్ద ఆటోస్టాండ్‌లో శ్రీనాథ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆపై అతని నుంచి 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వైజాగ్‌లో ఉన్న అనిల్, బెంగళూరులో ఉన్న మంజునాథ్ అనే ఇద్దరినీ కూడా అరెస్ట్ చేస్తామని సెబ్ అధికారులు తెలిపారు. శ్రీనాథరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్: చెక్‌బౌన్స్ కేసులో అన్నమయ్య జిల్లా, కలికిరి మండలం, వాడవాండ్ల పల్లికి చెంది ప్రస్తుతం తిరుపతి ఎల్‌బీనగర్‌లో నివసిస్తున్న బీ.వినోద్‌కుమార్‌కు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం తీర్పు చెప్పారు.

నకిలీ టికెట్లు పొందిన వ్యక్తిపై కేసు

తిరుమల: నకిలీ ఐడీ కార్డులతో టీటీడీ లక్కీడిప్‌లో శ్రీవారి సుప్రభాతసేవను పొందిన వ్యక్తిపై తిరుమల టూటౌన్ పోలీసులు కేసును నమోదుచేశారు. వివరాలు.. విజయవాడకు చెందిన రసూల్ టీటీడీ లక్కీడిప్‌లో పలు నకిలీ ఐడీ ఆధార్‌కార్డుల ద్వారా పాల్గొనేవాడు. ఆ విధంగా పొందిన టికెట్‌తో దర్శనానికి వచ్చిన అతడిని టీటీడీ విజిలెన్స్ వింగ్ అధికారులు గుర్తించారు. అతని వద్ద నుంచి నకిలీ ఐడీలను స్వాధీనం చేసుకుని తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సురక్ష..శ్రీరామరక్ష

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది. అందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి శ్రీకారం చుట్టింది. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి రోగులను గుర్తించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆయా సచివాలయాల పరిధిలో మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి వ్యాధిగ్రస్తులకు నిపుణులైన వైద్యులతో చికిత్సలందించింది. తొలివిడతగా మొత్తం 45 రోజుల పాటు జిల్లావ్యాప్తంగా ముమ్మరంగా వైద్యశిబిరాలు నిర్వహించింది. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడంతోపాటు.. అవసరమైన వారికి శస్త్రచికిత్సలను సైతం చేయించింది. దేశంలోనే తొలిసారిగా విప్లవాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష లబ్ధిదారుల ఆనందం వారి మాటల్లోనే.. – పాకాల



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు (ఫైల్)




ఇంటికే మందులు

తీవ్రమైన నడుము నొప్పుతో బాధపడేదాన్ని, ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద వైద్యశిబిరంలో చికిత్స చేయించుకున్నా. ఏఎన్‌ఎంలు ప్రతి నెలా మా ఇంటికే వచ్చి మందులు ఇస్తున్నారు. హెల్త్ క్యాంపులో ఉచితంగానే అన్నిరకాల పరీక్షలు చేశారు. ఈ పథకంతో పేదలకు ఎంతో ఉపయోగం.

– అన్నపూర్ణ, మొగరాల పంచాయతీ, పాకాల మండలం

జనవాక్కు



ఉచితంగా వైద్య పరీక్షలు

ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో సాధారణ వైద్య సేవలతో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందజేశారు. గతంలో ఇలాంటి కార్యక్రమాన్ని ఎప్పుడూ చూడలేదు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన పథకం ఎంతో ఉపయోగకరం.

– హుస్సేన్‌బీ, మొగరాల, పాకాల మండలం

అసమానతల నిర్మూలనకు పూలే కృషి



పూలేకు నివాళి అర్పిస్తున్న ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు వీఎస్ బాబు, సుబ్బరాజు, ఉద్యోగులు

తిరుపతి రూరల్: సమాజంలో అసమానతల నిర్మూలనకు మహాత్మా జ్యోతిబా పూలే ఎనలేని కృషి చేశారని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు వీఎస్ బాబు, సుబ్బరాజు పేర్కొన్నారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో స్త్రీలు, నిమ్న కులాల ప్రజలకు ఎదురయ్యే సాంఘిక దుశ్చర్యలపై జ్ఞానోదయాన్ని కల్పించేందుకు పూలే ఎనలేని కృషి చేశారన్నారు. చీఫ్ జనరల్ మేనేజర్లు లక్ష్మినరసయ్య, గురవయ్య, జాయింట్ సెక్రటరీ రాధాజయశ్రీ, జనరల్ మేనేజర్లు గోపాలకృష్ణ, సురేంద్రరావు, బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు చలపతి, జగదీష్, ఉద్యోగులు పాల్గొన్నారు.